

పనులు త్వరితగతిన పూర్తి చేయాలి : ముదునూరి

ప్రజాశక్తి - నరసాపురం టౌన్

నరసాపురం పురపాలక సంఘం పరిధిలో పలు వార్డుల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను రాష్ట్ర ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు గురువారం పరిశీలించారు. పెండింగ్‌లో ఉన్న రోడ్లు, డ్రెయినేజీలు, తదితర అభివృద్ధి పనుల పురోగతిపై అధికారులతో మాట్లాడారు. వివిధ దశల్లో ఉన్న పనులను వేగవంతం చేయాలని, పనుల్లో ఎటువంటి నాణ్యతా లోపాలు ఉండకూడదని తెలిపారు. శానిటేషన్‌పై అధికారులు పూర్తి పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. వివిధ పనులకు నిధులు మంజూరై టెండర్లు పూర్తయిన వెంటనే పనులు మొదలుపెట్టి పూర్తి చేయాలన్నారు. అనంతరం 8వ వార్డు పీచుపాలెం శ్మశానవాటిక, ఓవర్ హెడ్ పనులను పరిశీలించారు. తరువాత మున్సిపల్ కార్యాలయం ఛైర్‌పర్సన్ ఛాంబర్‌లో పురపాలక సంఘం పరిధిలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలపై అధికారులతో సమీక్షించారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్ పర్సన్ బర్రి శ్రీ వెంకటరమణ, వైస్ ఛైర్ పర్సన్ కామన నాగిని, మున్సిపల్ కమిషనర్ కె.వెంకటేశ్వరరావు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

పోరాడారు.. సాధించారు

మున్సిపల్ కార్మికుల సమ్మె తాత్కాలిక వాయిదా

ఎట్టకేలకు ప్రభుత్వంతో చర్చలు సఫలం

క్లీన్ ఎన్విరాల్ మెంటల్ వర్కర్లకు బేసిక్ జీతం రూ.21 వేలకు పెంపు

ఇచ్చిన హామీలు అమలు చేయకపోతే ఫిబ్రవరి నుండి మళ్లీ సమ్మెలోకి

ప్రజాశక్తి - భీమవరం

అడిగితే గాని అమ్మయినా అన్నం పెట్టదంటారు.. అదే భావించిన మున్సిపల్ కార్మికులు తమ సమస్యలపై ప్రభుత్వంతో పోరాడి సాధించుకున్నారు. సిఐటియు, ఎఐసిటియు, ఎఐటియుసి అండదండలతో 16 రోజుల పాటు కార్మికులు సమ్మె చేయడంతో ప్రభుత్వం దిగొచ్చింది. వివిధ కేటగిరీలో పనిచేస్తున్న కార్మికులకు సర్వీసును బట్టి వేతన పెంపునకు ప్రభుత్వం అంగీకరించింది. దీంతో సమ్మె తాత్కాలికంగా వాయిదా పడింది. ప్రస్తుతం ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయకపోతే ఫిబ్రవరి నుంచి మరోమారు సమ్మె చేపడతామని ట్రేడ్ యూనియన్లు, మున్సిపల్ కార్మికులు హెచ్చరిస్తున్నారు.

మున్సిపల్ కార్మికులు పారిశుధ్య నిర్వహణతో పాటు వివిధ కేటగిరీల్లో పనులు చేస్తూ పట్టణాభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్నారు. ఎన్నో ఏళ్ల నుంచి కార్మికులకు సమస్యలు వెంటాడుతున్నా కష్టాలను దిగమింగుకొని సమస్యలు పరిష్కారం అవుతాయని ఆశగా ఎదురు చూస్తూ జీవనం సాగిస్తున్నారు. అయితే అటు ప్రభుత్వాలు ఇటు పాలకులు మారినప్పటికీ తమ బతుకులు మాత్రం మారడం లేదని భావించిన మున్సిపల్ కార్మికులు ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేసి సిఐటియు, ఎఐసిటియు, ఎఐటియుసి ఆధ్వర్యంలో సమ్మెలోకి వెళ్లారు. జిల్లాలో భీమవరం, తాడేపల్లిగూడెం, తణుకు, ఆకివీడు, నరసాపురం, పాలకొల్లు వంటి ప్రాంతాలు మున్సిపల్ కేంద్రాలుగా ఉన్నాయి. ఈ పరిధిలో సుమారు 1500 మంది మున్సిపల్ కార్మికులు పనిచేస్తున్నారు. వారిలో 500 మంది పర్మినెంట్ కార్మికులు ఉండగా కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ పరిధిలో పనిచేస్తున్న వెయ్యి మంది కార్మికులు సమ్మె చేపట్టారు. గతేడాది డిసెంబర్ 26న సమ్మె చేపట్టి జిల్లా వ్యాప్తంగా నిరసన తెలిపారు. అయితే సమ్మెపై ప్రభుత్వం తీవ్ర నిర్బంధాన్ని విధించి అరెస్టులకు కూడా పాల్పడింది. గతేడాది డిసెంబర్ 26 నుంచి ఈ ఏడాది జనవరి 10వ తేదీ వరకూ సమ్మె కొనసాగించారు. అయితే ప్రభుత్వంతో రెండు సార్లు చర్చలు జరిగినప్పటికీ ఫలితం లేకుండా పోవడంతో సమ్మెను మరింత ఉధృతం చేశారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం దిగొచ్చి మూడో దఫా జరిగిన చర్చలు సఫలీకృతం అయ్యాయి. క్లీన్ ఎన్విరాన్మెంటల్ కార్మికులకు హెల్త్ అలవెన్స్‌తో సంబంధం లేకుండా జనవరి నుంచి రూ.21 వేలు బేసిక్ జీతంగా మారింది. దీనికి సంబంధించి ఒక నెల జీతం బోనస్‌గా లేదా నెలకు రూ.3 వేలు లేదా రూ.2 వేలు అయినా అదనంగా జీతం పెంచాలని ట్రేడ్ యూనియన్లు కోరాయి. కానీ దీనికి ప్రభుత్వం నిరాకరించి సంక్రాంతి కానుకగా రూ.వెయ్యి కార్మికులందరికీ ఇచ్చేందుకు నిర్ణయం తీసుకుంది. అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ వర్కర్లు, శానిటేషన్ డ్రెయివర్లకు జనవరి నుండి రూ. 24,500 బేసిక్ జీతం పెరిగింది.



భీమవరంలో ఆందోళన చేస్తున్న మున్సిపల్ కార్మికులు

క్లీన్ ఎన్విరాన్మెంటల్ కార్మికులకు సంక్షేమ పథకాలు అమలు కానున్నాయి. ఇంజినీరింగ్ విభాగంలోని జిఒ 30లో సెమిస్కిల్డ్‌కు బదులు అన్‌స్కిల్డ్ జీతాలు పొందుతున్న కార్మికులకు వారం రోజుల్లో ఫైనాన్స్ డిపార్ట్మెంట్ ఆమోదం తీసుకొని సెమీస్కిల్డ్ జీతాలు చెల్లించనున్నారు.

సర్టిఫికెట్లు లేకుండా సెమీస్కిల్డ్ విధులు నిర్వహిస్తున్న కార్మికులకు స్కిల్ డెవలప్మెంట్ వారి ద్వారా కోర్సు డిజైన్ చేసి ట్రెనింగ్ ఇచ్చి సర్టిఫికెట్స్ ఇచ్చిన తర్వాత పనికి తగిన జీతం చెల్లించనున్నారు. ఇంజినీరింగ్‌లో మిగిలిన స్ట్రీట్ లైటింగ్, మెకానిక్‌లు తదితర కేటగిరీలకు చెందిన కార్మికుల సమస్యల పరిష్కారానికి ఐఎఎస్ అధికారులతో కూడిన 9 మందితో కమిటీ ఏర్పాటు చేసి వారి నుంచి నివేదిక వచ్చిన తర్వాత వీరి సమస్యలు పరిష్కరించేందుకు ప్రభుత్వం సానుకూలంగా స్పందించింది. ఇంజినీరింగ్, పారిశుధ్య కార్మికులందరికీ పదేళ్ల సర్వీస్ ఉన్నవారికి రిటైర్మెంట్ బెనిఫిట్ కింద రూ.75 వేలు ఇచ్చేందుకు ప్రభుత్వం అంగీకరించింది. అలాగే ఎక్స్‌గ్రేషియోకు సంబంధించి సాధారణ మరణానికి రూ. 2 లక్షలు, ప్రమాదవశాత్తూ మరణిస్తే రూ.7 లక్షలు ఇచ్చేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. దహన సంస్కారాలకు ఇచ్చే ఆర్థిక సహాయం రూ.15 వేల నుంచి రూ.20 వేలకు పెంచింది. క్లాప్ డ్రైవర్ల సమస్యల పరిష్కారానికి జనవరి 30వ తేదీలోపు స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఎమ్‌డి, కాంట్రాక్టర్లు కార్మిక సంఘాలతో జాయింట్ మీటింగ్ ఏర్పాటు చేసి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ప్రభుత్వ హామీ ఇచ్చింది.

16 రోజుల సమ్మె కాలానికి జీతం చెల్లించడంతోపాటు పోలీస్ కేసులు ఎత్తివేస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చింది. దీంతో సిఐటియుతో పాటు ఇతర ట్రేడ్ యూనియన్లపై మున్సిపల్ కార్మికులు అభినందనల వర్షం కురిపించారు. ప్రస్తుతం ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయకపోతే ఫిబ్రవరి నుంచి మరోమారు సమ్మె చేపడతామని ట్రేడ్ యూనియన్లు, కార్మికులు ప్రభుత్వాన్ని హెచ్చరిస్తున్నాయి.

నిర్బంధాన్ని ఎదిరించి..



గొల్లపాటి నాని, మున్సిపల్ కార్మికుడు, భీమవరం

సమస్యల పరిష్కారానికి సమ్మె చేపడితే ప్రభుత్వం తీవ్ర నిర్బంధాన్ని విధించింది. పోలీసులను ఉపయోగించి అణిచివేసే ప్రయత్నం చేసింది. అయినా నిర్బంధాన్ని ఎదిరించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా సమ్మె చేశాం. ప్రభుత్వం దిగొచ్చింది. కలిసికట్టుగా ఉంటే ఏదైనా సాధ్యమవుతుందనడానికి ఇదే నిదర్శనం.

ట్రేడ్ యూనియన్ల సహకారం మరువలేనిది

బంగారు వరలక్ష్మి, మున్సిపల్ కార్మికురాలు, భీమవరం

ఎన్నో ఏళ్ల నుంచి మున్సిపల్ కార్మికురాలుగా పనిచేస్తున్నాను. సమస్యలు పరిష్కారమవుతాయని ఎదురుచూస్తూనే ఉన్నాం. చూస్తూ ఊరుకోలేక సమ్మె బాట పట్టాం. ట్రేడ్ యూనియన్ల సహకారంతో సమస్యలు పరిష్కారమయ్యాయి. ప్రతి కార్మికుడూ సంఘంలో ఉంటేనే సమస్యల పరిష్కారానికి బలం మరింత పెరుగుతుంది.



కార్మిక సంఘాల సేవలు అభినందనీయం

నీలాపు రాజు, మున్సిపల్ కార్మికులు భీమవరం



సమ్మెకు అండగా ట్రేడ్ యూనియన్లు నిలిచాయి. సమస్యలు పరిష్కారానికి మద్దతు పలికి యూనియన్ నేతలు అందించిన సేవలు అభినందనీయం. నిరంతరం తమకు అండగా ఉండి ప్రభుత్వంతో పోట్లాడి కేసులకు బలవుతున్నా నేతలు చూపిస్తున్న ఆదరాభిమానాలు మరువలేనివి. ట్రేడ్ యూనియన్ల బలంతోనే ప్రభుత్వం దిగొచ్చి సమస్యలు పరిష్కరించింది.

పోరాడి సాధించుకున్నారు..



బి.వాసుదేవరావు, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా నాయకులు

మున్సిపల్ కార్మికులు 16 రోజులు సమ్మె చేసి ప్రభుత్వంతో పోరాడి సమస్యలు పరిష్కరించుకున్నారు. సమ్మెపై తీవ్ర నిర్బంధాన్ని విధించి అరెస్టులు చేసినప్పటికీ కార్మికులు వెనక్కి తగ్గకుండా ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిలబడ్డారు. సమస్యలు పరిష్కారం కావాలంటే ఐక్య ఉద్యమాలతోనే సాధ్యమని నిరూపించారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయకపోతే మళ్లీ సమ్మెలోకి వెళ్లేందుకు సిద్ధంగా ఉండాలి.

ఒక్క అంగన్‌వాడీని తొలగించినా తీవ్ర ప్రతిఘటనే

- ఉపాధ్యాయ, ఉద్యోగ ఖాళీలను భర్తీ చేయాలి
- రాజకీయ, ప్రజా సమస్యలపై పలు తీర్మానాలు
- ముగిసిన సిపిఎం రాష్ట్ర కమిటీ సమావేశాలు
- బిజెపికి వైసిపి, టిడిపి, జనసేన మద్దతు రాష్ట్రానికి తీవ్ర ద్రోహం
- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి



అంగన్‌వాడీల్లో ఏఒక్కరిని తొలగించినా తీవ్ర ప్రతిఘటన తప్పదని, వారి సమస్యలను తక్షణం పరిష్కరించకపోతే వైసిపి ప్రభుత్వం పతనం కావడం ఖాయమని సిపిఎం రాష్ట్ర కమిటీ స్పష్టం చేసింది. ఆ పార్టీ రాష్ట్ర కమిటీ సమావేశాలు బుధ, గురువారాల్లో రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై.వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగాయి. వివిధ జిల్లాల నుంచి 65 మంది ప్రతినిధులు ఈ సమావేశానికి హాజరయ్యారు. ఈ సమావేశాల్లో రాజకీయ, ప్రజా సమస్యలపై పలు తీర్మానాలు చేశారు. సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు ఎం.ఎ.బేబి, బివి.రాఘవులు సమావేశాల్లో పాల్గొని భవిష్యత్తు కార్యాచరణకు దిశానిర్దేశం చేశారు. తొలిరోజు బుధవారం ఉదయం సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సమావేశం జరిగింది. మధ్యాహ్నం పొలిట్‌బ్యూరో సభ్యులు ఎం.ఎ.బేబి, బివి.రాఘవులు మీడియాతో దేశ, రాష్ట్ర రాజకీయాలతోపాటు ప్రజాసమస్యలపై మాట్లాడారు. మధ్యాహ్నం రాష్ట్ర కమిటీ సమావేశాలు కొనసాగాయి. రెండు రోజులపాటు జరిగిన రాష్ట్ర కమిటీ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలు, రాష్ట్రంలో నెలకొన్న ప్రజా సమస్యలపై సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు గురువారం స్థానిక సిపిఎం జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరించారు. వచ్చే ఎన్నికల్లో బిజెపి వ్యతిరేక శక్తులను కూడగట్టి ముందుకు సాగాలని నిర్ణయించినట్లు తెలిపారు. స్వార్థ రాజకీయాలకు పాల్పడుతున్న బిజెపికి రాష్ట్రంలోని ప్రధాన పార్టీలైన టిడిపి, వైసిపి, జనసేన మద్దతు పలకడం దుర్మార్గమన్నారు. అంగన్వాడీలు రోడ్డున పడి 31 రోజులు గడుస్తున్నా సమస్యలు పరిష్కరించకుండా రాష్ట్ర ప్రభుత్వం నిర్బంధం ప్రయోగించడాన్ని సిపిఎం తీవ్రంగా ఖండిస్తుందన్నారు. వెంటనే చర్చలు జరిపి సమస్యలను పరిష్కరించి అంగన్‌వాడీలంతా సంక్రాంతి పండుగ జరుపుకునేలా చూడాలన్నారు. సమస్యలు పరిష్కరించకపోతే రాష్ట్ర ప్రభుత్వం అందుకు తగిన ఫలితం అనుభవించాల్సి ఉంటుందన్నారు. అంగన్వాడీల సమ్మెపై ప్రజల నుంచి సానుభూతి ఉందన్నారు. 32 లక్షల మంది తల్లీ బిడ్డలకు రక్షణగా ఉంటున్నారని తెలిపారు. ప్రభుత్వం ప్రతిష్టకు పోయి అంగన్వాడీలను చీల్చడం, అణిచివేయడం చేస్తే వైసిపికి రాజకీయంగా ఎదురుదెబ్బ తప్పదన్నారు. అవసరమైతే అన్ని రాజకీయ పార్టీలూ కలిసి రాష్ట్ర బంద్‌కు పిలుపునిస్తామని హెచ్చరించారు. ప్రతియేటా జనవరిలో జాబ్‌క్యాలెండర్ అంటూ ప్రభుత్వం చెప్పిందని గుర్తు చేశారు. మెగా డిఎస్‌సి కోసం ఐదు లక్షల మంది నిరుద్యోగులు ఎదురుచూస్తున్నారని తెలిపారు. ఏజెన్సీలో స్పెషల్ డిఎస్‌సి వేయడం లేదన్నారు. పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఉద్యోగాలకు వయోపరిమితి 47 ఏళ్లకు పెంచాలన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయుల బకాయిలు చెల్లించడంతోపాటు 104, 108, ఆశాలు, కమ్యూనిటీ హెల్త్ వర్కర్స్, రైతుల సమస్యలను పరిష్కరించాలన్నారు. ప్రజా సమస్యలు గాలికొదిలేసి రాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు. ప్రభుత్వం రోజురోజుకీ ప్రజాదరణ కోల్పోతుందన్నారు. సంక్షేమ పథకాలతో ఓట్లు వస్తాయనుకుంటే చెల్లదని, అది వైసిపి రాజకీయ ఉనికికే ప్రమాదమని హెచ్చరించారు. కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మంతెన సీతారాం, జిల్లా కార్యదర్శి ఎ.రవి, నగర కార్యదర్శి పి.కిషోర్ పాల్గొన్నారు.



బొమ్మల కొలువును పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ ప్రశాంతి

సంప్రదాయాలకు ప్రతీక సంక్రాంతి : కలెక్టర్

కలెక్టరేట్లో ఘనంగా సంక్రాంతి సంబరాలు


ప్రజాశక్తి - భీమవరం

భీమవరం కలెక్టరేట్లో సంక్రాంతి సంబరాలు గురువారం అంబరాన్నంటాయి. జిల్లా ఖజానా, ట్రెజరీ శాఖల ఆధ్వర్యంలో ఈ వేడుకలు వైభవంగా సాగాయి. సంక్రాంతి సంబరాలను జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి ప్రారంభించారు. జిల్లా ఖజానా శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన బొమ్మల కొలువు ఎంతో మందిని ఆకట్టుకుంది. జిల్లా కలెక్టర్ ప్రశాంతి ఖజానా కార్యాలయ సిబ్బందికి సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. సాంప్రదాయం ఉట్టిపడేలా వేడుకగా జిల్లా ట్రెజరీ అధికారి ఆడారి గణేష్ ఆధ్వర్యంలో నిర్వహించడాన్ని ప్రశంసించారు. కలెక్టర్ మాట్లాడుతూ తెలుగు వారి అతిపెద్ద పండుగ సంక్రాంతి అన్నారు. కుటుంబ సభ్యులందరూ పండగ రోజుల్లో ఒక చోట చేరి ఆనందోత్సాహాలతో సాంప్రదాయబద్ధంగా జరుపుకునే పండుగ సంక్రాంతి అన్నారు. జిల్లా ట్రెజరీ కార్యాలయంలో తెలుగు సంక్రాతి పండుగను పురస్కరించుకొని గురువారం నుంచి శనివారం వరకూ మూడు రోజులు పాటు సంక్రాంతి సంబరాలు నిర్వహించేందుకు ఏర్పాటు చేశారు. బొమ్మల కొలువు, భోగి మంట, చెరుకు గెడలు, పూర్ణకలశాలు, ధాన్యపు కంకులు, రేగిపళ్ల మొదలైన వాటితో సంక్రాంతి శోభను తీర్చిదిద్దారు. జిల్లా ట్రెజరీ సభ్యులందరికి 'ఖేలో ఖజానా' పేరుతో ఆటల పోటీలు నిర్వహించారు. గురువారం మధ్యాహ్నం సంక్రాంతి వంటలైన క్షీరాన్నం, కొబ్బరి అన్నం, చింతపండు పులిహోర, పెరుగు ఆవడ, అరిసెలు, బూరెలు, గారెలు, బొబ్బట్లు, కాజాలు, సున్నుండలు, లడ్డూలు పూతరేకులు, కజ్జికాయలు, జంతికలు, అప్పడాలు, ఉలవచారు, పచ్చిపులుసు, రోటి పచ్చడి మొదలైన పిండివంటలను సిబ్బంది స్వయంగా తయారుచేసి ఆహుతులకు విందు ఏర్పాటు చేశారు. జిల్లా ట్రెజరీ అధికారి ఆడారి గణేష్, సహాయ ట్రెజరీ అధికారి అబ్దుల్ హకీం, ఎస్‌టిఒలు జె.రామారావు, ఇ.హిమబిందు, ఎ.రవివర్మ, పి.హరిబాబు పాల్గొన్నారు.

'జగనన్నతోడు'తో చిరు వ్యాపారుల అభివృద్ధి

జిల్లా కలెక్టర్ ప్రశాంతి

ప్రజాశక్తి - భీమవరం



లబ్ధిదారులకు నమూనా చెక్కు అందిస్తున్న కలెక్టర్ ప్రశాంతి

'జగనన్న తోడు' ద్వారా అందిస్తున్న రూ.10 వేల రుణం చిరు వ్యాపారుల్లో ఆత్మ గౌరవాన్ని పెంచుతుందని జిల్లా కలెక్టరు పి.ప్రశాంతి అన్నారు. 8వ విడత జగనన్నతోడు వడ్డీ లేని రుణాలను ముఖ్యమంత్రి జగన్ తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుండి బటన్ నొక్కి ప్రారంభించారు. స్థానిక కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టరు ప్రశాంతి, ఎంబిసి ఛైర్మన్ పెంద్ర వీరన్న, సంబంధిత అధికారులు, లబ్ధిదారులు వర్చువల్‌గా తిలకించారు. అనంతరం జిల్లా కలెక్టరు మాట్లాడుతూ చిరు వ్యాపారుల ఆర్థికాభివృద్ధికి జగనన్న తోడు సహాయంగా ఉంటుందన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. చిరు వ్యాపారులు, సాంప్రదాయ చేతి వృత్తుల వారు తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించి వడ్డీ రియంబర్స్ మెంటు పొందాలన్నారు. జిల్లాలో వడ్డీ రాయితీ కింద 30,077 మంది చిరు వ్యాపారుల ఖాతాల్లో రూ.78,61,023 జమ చేసినట్లు తెలిపారు. అనంతరం దీనికి సంబంధించిన నమూనా చెక్కును లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో గ్రామ సచివాలయాల అధికారి కెసిహెచ్ అప్పారావు, డిఆర్‌డిఎ పీడీ ఎన్‌విఎస్.ప్రసాద యాదవ్, డిఎంహెచ్ఒ డి.మహేశ్వరరావు, లీడ్ బ్యాంకు జిల్లా మేనేజరు నాగేంద్ర ప్రసాద్ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరిస్తేనే విధుల్లోకి..



ఆచంటలో గడ్డితింటూ నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు

31వ రోజు కొనసాగిన అంగన్‌వాడీల సమ్మె

ప్రజాశక్తి - భీమవరం రూరల్

జగన్ ఇప్పటికైనా అంగనవాడీల సమస్యలు పరిష్కరించాలని సిఐటియు మండల కార్యదర్శి ఇంజేటి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. 31వ రోజు గురువారం నిరవధిక దీక్షలు కొనసాగాయి. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడారు. సమ్మెకు యుటిఎఫ్ రాష్ట్ర కోశాధికారి గోపీమూర్తి సంఘీభావం తెలిపి మాట్లాడారు. కార్యక్రమంలో అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు జి.విజయలక్ష్మి, దుర్గ, మాధవి, వెంకటలక్ష్మి, శాంతకుమారి పాల్గొన్నారు. సమ్మె శిబిరం వద్దకు భీమవరం ప్రాజెక్టు డైరెక్టర్ సిడిపిఒ లక్ష్మీకాంతం మంచి నిర్ణయం తీసుకోవాలని చెప్పారు. ప్రభుత్వం సమస్యలు పరిష్కరిస్తేనే విధుల్లోకి వస్తామని, లేకపోతే సమ్మె కొనసాగిస్తామని తేల్చి చెప్పారు.

ఆచంట : అంగన్వాడీలు ఆర్థికంగా అనేక ఇబ్బందులు పడుతున్నారని, తక్షణం ప్రభుత్వం స్పందించి సమస్యలు పరిష్కరించాలని సిఐటియు మండల కార్యదర్శి వద్దిపర్తి అంజి బాబు అన్నారు. ఆచంట కచేరీ సెంటర్లో చేపట్టిన సమ్మె 31వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా అంగన్వాడీలు గడ్డితింటూ నిరసన తెలిపారు. కార్యక్రమంలో పద్మ, కమల, నాగమణి, సత్యవతి, శ్రీదేవి, మంగయమ్మ, గౌరీ, వెంకాయమ్మ పాల్గొన్నారు.

గణపవరం : కనీస వేతనాలు అమలు చేయాలని 31 రోజులుగా సమ్మె చేస్తున్న అంగన్వాడీలు గురువారం రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా అంగన్వాడీ హెల్పర్ వర్కర్స్ యూనియన్ మండల కమిటీ నాయకురాలు రామకోటి మాట్లాడారు. కార్యక్రమంలో కెవి.మహాలక్ష్మి, బండారు పార్వతి, సిహెచ్ సీతామాలక్ష్మి, ధనలక్ష్మి, కళ్యాణి జయలక్ష్మి పాల్గొన్నారు.

యలమంచిలి : అంగన్వాడీల సమ్మె 31వ రోజుకు చేరింది. సమ్మెకు సమ్మెకు ఐద్వా నాయకులు సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి దేవ సుధాకర్, ఐద్వా నాయకులు సరిపల్లి జయప్రభ, జిల్లెల్ల ప్రశాంతి, బాతిరెడ్డి సుగుణ, జయశ్రీ, నాగమణి పాల్గొన్నారు.

ఉండి : తహశీల్దార్ కార్యాలయం వద్ద అంగన్వాడీలు చేస్తున్న సమ్మె 31వ రోజుకు చేరింది. ఈ మేరకు గురువారం రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. సమ్మెకు సిఐటియు జిల్లా అధ్యక్షులు జెఎన్‌వి గోపాలన్, అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా సహాయ కార్యదర్శి మహ్మద్ హసీనా బేగం, యుటిఎఫ్ మండల నాయకుడు ఏసుబాబు సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో సిఐటియు మండల అధ్యక్షులు ధనికొండ శ్రీనివాస్, అంగన్వాడీలు ఎం.చైతన్య, వీరవల్లి వెంకటలక్ష్మి, గడి కుసుమ, జయశ్రీ, శ్యామల, ప్రేమలత పాల్గొన్నారు.

పోడూరు : అంగన్వాడీల దీక్షలు 31వ రోజుకు చేరాయి. ఈ మేరకు మెడలో ఎర్ర రిబ్బన్లు వేసుకుని నిరసన తెలిపారు. కార్యక్రమంలో ప్రాజెక్టు లీడర్ పీతల రాజమణి, జె.ఉమాదేవి, రాయుడు కుమారి, సిఐటియు నాయకులు పిల్లి.ప్రసాద్, బూరాబత్తుల వెంకటరావు పాల్గొన్నారు.

ఆచంట, (పెనుమంట్ర) : అంగన్వాడీలు 31 రోజులుగా అలుపెరుగని పోరాటం చేస్తున్నా ప్రభుత్వానికి చీమకుట్టినట్లు కూడా లేదని సిఐటియు మండల కార్యదర్శి కె.శ్రీనివాస్ ప్రసాద్ అన్నారు. అంగన్వాడీల రిలే నిరాహార దీక్షలు కొనసాగాయి. ఈ సందర్భంగా బ్రాహ్మణచెరువు సివిల్ సప్లై హమాలీలు ర్యాలీగా బయలుదేరి అంగన్వాడీల సమ్మెకు సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో హమాలీ కార్మికులు గంటి ఆంజనేయులు, కె.వెంకటేశులు, బి.నాగేశ్వరరావు, బి.ఏడుకొండలు పాల్గొన్నారు.



వీరవాసరంలో నాలుక గీస్తూ నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు

వీరవాసరం :వీరవాసరంలో అంగన్‌వాడీలు వినూత్నంగా నిరసన తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన ఎస్మా నోటీసులు నాలుక గీసుకోవడానికి కూడా పనికిరావని తెలిపారు. యూనియన్ నాయకురాలు నాగరత్నం మాట్లాడారు.

కాళ్ల : అంగన్వాడీల డిమాండ్లు పరిష్కారమయ్యే వరకూ సమ్మె కొనసాగుతుందని అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు హసీనా ప్రభుత్వాన్ని హెచ్చరించారు. తహశీల్దార్ కార్యాలయం వద్ద అంగన్వాడీల సమ్మె కొనసాగింది. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షులు జెఎన్‌వి.గోపాలన్ మాట్లాడారు. సమస్యలు పరిష్కరించే వరకూ సమ్మె విరమించబోమని అంగన్వాడీలు ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో సిఐటియు మండల అధ్యక్ష కార్యదర్శులు గొర్ల రామకృష్ణ, మండా సూరిబాబు, సిఐటియు జిల్లా అధ్యక్షులు జెఎన్‌వి.గోపాలన్, జనసేన నాయకులు పాల్గొన్నారు.

మొగల్తూరు : అంగన్వాడీలు సమ్మె 31వ రోజు కొనసాగింది. అంగన్వాడీలకు షోకాజ్ నోటీసులిచ్చే అధికారం ప్రభుత్వానికి లేదని అంగన్‌వాడీ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షులు జిఎస్.రాణి అన్నారు. దీక్షా శిబిరాన్ని ఆమె సందర్శించి మాట్లాడారు. కార్యక్రమంలో అంగన్వాడీలు పెద్దింట్లు, సీత, సారమ్మ, నాగలక్ష్మి, రేఖ శాంభవి పాల్గొన్నారు. సమ్మెకు యుటిఎఫ్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు సిహెచ్.కృష్ణమోహన్, సిహెచ్.శ్రీనివాస్, కోశాధికారి కె.బ్రహ్మయ్య సంఘీభావం తెలిపారు. అలాగే అంగన్వాడీల దీక్షలకు జనసేన నరసాపురం నియోజకవర్గ ఇన్‌ఛార్జి బొమ్మిడి నాయకర్ సంఘీభావం తెలిపి మాట్లాడారు.

పెనుగొండ : అంగనవాడీల సమ్మె కొనసాగింది. పంచాయతీ పార్కు వద్ద శిబిరంలో సిఐటియు నాయకులు ఎస్.వెంకటేశ్వరరావు పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో సిఐటియు నాయకురాలు తులసి, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

తణుకు రూరల్ : ప్రభుత్వం దిగొచ్చేంత వరకూ సమ్మె ఆగదని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు అడ్డగర్ల అజయ కుమారి హెచ్చరించారు. కోర్టు వద్ద సమ్మె 31 రోజుకు చేరుకున్న నేపథ్యంలో నిరాహార దీక్షలు ప్రారంభించారు. కార్యక్రమంలో మణి మాలతీ, ప్రమీల, కనకదుర్గ, వసంత కుమారి, జ్యోతి, ధనలక్ష్మి, రాజకుమారి పాల్గొన్నారు.

ఆకివీడు : అంగన్వాడీలది ధర్మ యుద్ధమని సిఐటియు జిల్లా అధ్యక్షులు జెఎన్‌వి గోపాలన్ అన్నారు. అనంతరం ఆయన మాట్లాడారు. సమస్యలు పరిష్కరించే వరకూ సమ్మె విరమించేది లేదని అంగన్వాడీలు ప్రతిజ్ఞ చేశారు. జిల్లా సహాయ కార్యదర్శి షేక్ హసీనా, కాళ్ల మండల అధ్యక్షులు మండా సూరిబాబు, వీరవల్లి వెంకటలక్ష్మి, సిఐటియు మండల కార్యదర్శి కె.తవిటి నాయుడు, అధ్యక్షులు పెంకి అప్పారావు, కృష్ణకుమారి పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం : తహశీల్దార్ కార్యాలయం వద్ద 31వ రోజు అంగన్‌వాడీలు నిరాహార దీక్ష చేపట్టారు. అనంతరం అంగన్వాడీ వర్కర్స్ హెల్పర్స్ యూనియన్ అధ్యక్షురాలు దీన స్వరూపారాణి మాట్లాడారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు యడవల్లి వెంకట దుర్గారావు పాల్గొన్నారు. ఐఎఫ్‌టియు జిల్లా సహాయ కార్యదర్శి దాన వరప్రసాద్ సంఘీభావం తెలిపారు.

అత్తిలి : అంగన్‌వాడీల సమ్మె కొనసాగింది. ఈ మేరకు రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి కె. ధర్మేంద్ర, సిపిఎం మండల కన్వీనర్ వనం రాంబాబు, కార్యకర్తలు, కౌలు రైతు సంఘం నాయకులు కేతా గోపాలన్ పాల్గొన్నారు.

నరసాపురం టౌన్ : 31వ రోజు పట్టణంలోని అంబేద్కర్ కూడలిలో అంగన్వాడీలు రిలే నిరాహార దీక్ష చేపట్టారు. శిబిరానికి సిఐటియు జిల్లా కార్యదర్శి ముచ్చర్ల త్రిమూర్తులు సంఘీభావం తెలిపి ప్రసంగించారు. కార్యక్రమంలో సిఐటియు పట్టణ కార్యదర్శి పొన్నాడ రాము, అంగన్వాడీలు గన్నాబత్తుల వెంకటలక్ష్మి, ఆకుల లలిత, శ్రీలక్ష్మి, నిర్మలకుమారి పాల్గొన్నారు.

పాలకొల్లు : తహశీల్దార్ కార్యాలయం వద్ద అంగన్వాడీలు గురువారం రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. సమ్మెకు సిఐటియు నేతలు మద్దతు తెలిపారు.



డిఇఒకు సమ్మె విరమణ నోటీసు ఇస్తున్న సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగులు

సమగ్ర శిక్ష ఉద్యోగుల సమ్మె విరమణ

ప్రజాశక్తి - భీమవరం రూరల్

తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ సమగ్ర శిక్ష ఉద్యోగులు చేపట్టిన సమ్మె గురువారం విరమించారు. డిసెంబర్ 19 తేదీన సమగ్ర శిక్ష ఉద్యోగులు సమ్మె నోటీసు ఇచి 20వ తేదీ నుంచి సమ్మె చేపట్టి నిరసన కార్యక్రమాలు చేపట్టారు. వీరి సమ్మెకు సిఐటియు బాసటగా నిలిచి పూర్తి మద్దతు తెలిపింది. దీనికి తోడు ఉపాధ్యాయ సంఘాలు యుటిఎఫ్, రాజకీయ పార్టీలు మద్దతు తెలిపాయి. 21 రోజుల తర్వాత దిగొచ్చిన ప్రభుత్వం డిమాండ్లను పరిశీలించేందుకు హామీ ఇవ్వడంతో ఉద్యోగులు సమ్మె విరమించి గురువారం డిఇఒ వెంకటరమణకు విరమణ నోటీసు ఇచ్చి విధుల్లోకి హాజరయ్యారు. సమ్మె శిబిరం వద్దకు సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి రామ్మోహన్ రాయ్ వెళ్లి ఉద్యోగులను అభినందించారు. పోరాటాలతోనే హక్కులను సాధించుకోగలమని అన్నారు. యుటిఎఫ్ రాష్ట్ర కోశాధికారి బి.గోపిమూర్తి మాట్లాడుతూ సమ్మెతో ఉద్యోగులకు ఒక గుర్తింపు వచ్చిందన్నారు. సిఐటియు ఆధ్వర్యంలో సమగ్ర శిక్ష ఉద్యోగ సంఘం మరింత బలపడటానికి బలమైన పునాది వేసుకోవాలన్నారు. సమగ్ర శిక్ష జెఎసి జిల్లా అధ్యక్షులు షేక్ బావాజీ మాట్లాడారు. సమ్మెకు మద్దతు ప్రకటించిన రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాలకు, తోటి ఉద్యోగులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు బి.రామరాజు, సమగ్ర శిక్ష జెఎసి నాయకులు వాసు, సంతోషి, నాగలక్ష్మి, శ్రీనివాస్ ఉద్యోగులు పాల్గొన్నారు.

ఆదర్శనీయుడు అంబేద్కర్ : కలెక్టర్ ప్రశాంతి

ప్రజాశక్తి - భీమవరం

అంబేద్కర్ దేశ ప్రజలందరికీ ఆదర్శనీయుడని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. అంబేద్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని పురస్కరించుకుని సామాజిక సమతా సంకల్పం (జన భాగీధరి) కార్యక్రమంలో భాగంగా అంబేద్కర్ జీవిత చరిత్రపై సాంఘిక సంక్షేమ సాధికారత శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్ ఆమె గురువారం ప్రారంభించారు. అంబేద్కర్ జీవితంపై ఏర్పాటు చేసిన ఫొటో ప్రదర్శన ప్రత్యేకంగా ఆకట్టుకుంది. కలెక్టరేట్‌లో ఉన్న అంబేద్కర్ విగ్రహానికి, సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన చిత్రపటానికి కలెక్టర్ పి.ప్రశాంతి, జెసి ఎస్.రామ్‌సుందర్‌రెడ్డి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి బి.శివన్నారాయణరెడ్డి, జిల్లా సాంఘిక సంక్షేమ శాఖాధికారి కె.శోభారాణి, జిల్లా గ్రామ, వార్డు సచివాలయాల అధికారి కెసిహెచ్.అప్పారావు, జిల్లా విద్యాశాఖాధికారి ఆర్.వెంకటరమణ, జిల్లా బిసి సంక్షేమ శాఖాధికారి బి.గణపతిరావు, జిల్లా ట్రైబల్ అధికారి బి.పుష్పరాణి, వివిధ శాఖల జిల్లా అధికారులు, జిల్లా విజిలెన్స్ మానిటరీ కమిటీ మెంబర్లు జిల్లెళ్ల సత్య సుధామ, సిహెచ్.మంగరాజు, మాలమహానాడు రాష్ట్ర కార్యదర్శి కె.రాజారావు, నాయకులు పాలపర్తి జోన్, కెసి.రాజు పాల్గొన్నారు.

ప్రభుత్వ హామీలు జిఒల రూపంలో ఇవ్వాలి

ప్రజాశక్తి - తణుకు రూరల్

మున్సిపల్ కార్మికుల సమ్మెలో భాగంగా ప్రభుత్వం ఇచ్చిన హామీలు జిఒల రూపంలో వెంటనే ఇవ్వాలని సిఐటియు జిల్లా కార్యదర్శి పి.వి.ప్రతాప్, యూనియన్ గౌరవ అధ్యక్షులు కామన మునిస్వామి డిమాండ్ చేశారు. స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద దర్నాలు జరిగిన వేదవ్యాలో తాత్కాలిక సమ్మె విరమణలో భాగంగా సిఐటియు ఆధ్వర్యంలో జరిగిన ఒప్పంద విషయాలపై గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతాప్, మునిస్వామి మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులు 16 రోజుల సమ్మె తమ న్యాయమైన అంశాలపై చేసినా ప్రభుత్వం సరిగ్గా స్పందించలేదని విమర్శించారు. ఈ పోరాటానికి మద్దతు ఇచ్చిన ప్రజా సంఘాలవారికి, రాజకీయ పార్టీలవారికి, ప్రజలకు సిఐటియు ధన్యవాదాలు తెలుపుతుందని చెప్పారు. ప్రభుత్వం చెప్పిన మాట ప్రకారం జిఒలు ఇవ్వకపోతే ఫిబ్రవరిలో మళ్లీ ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు అడ్డగర్ల అజయకుమార్, అధ్యక్షులు అర్తి కృష్ణబాబు, కార్యదర్శి కె.ఆదినారాయణబాబు, కె.అయ్యప్ప, సుధాకర్, జ్యోతిబాబు, శ్రీను, రాణి, అనంతలక్ష్మి, రాజమ్మ, రమేష్, అన్నపూర్ణ, నాగేంద్రకుమార్ పాల్గొన్నారు.

సిసి రోడ్లు ప్రారంభం

ప్రజాశక్తి - భీమవరం రూరల్

మండలంలోని చిన అమిరంలో సుమారు రూ.3.63 కోట్ల నిధులతో నిర్మించిన 15 సిసి రోడ్లను ప్రభుత్వ విప్, ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యాలయం వద్ద నిర్వహించిన సభలో ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామాన్ని కూడా పూర్తిస్థాయిలో అభివృద్ధి చేస్తున్నామని, ఇందులో భాగంగానే గత నాలుగున్నరేళ్లుగా కోట్లాది రూపాయలతో ఈ గ్రామంలో సిసి రోడ్లు, డ్రైనేజి నిర్మించామని తెలిపారు. అనంతరం గ్రామంలో రూ.25 లక్షల నిధులతో నిర్మించనున్న డ్రెయిన్ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్, పార్టీ సీనియర్ నాయకులు గొట్టుముక్కల సత్యనారాయణరాజు (ధర్మరాజు), ఎఎంసి ఛైర్మన్ కోటిపల్లి బాబు, కోళ్ల బాలకృష్ణ, పెనుమాల నరసింహస్వామి, కాకిలేటి బాబు, చిగురుపాటి సందీప్ పాల్గొన్నారు.

ముత్యాలపల్లిలో లాల్ బహదూర్ శాస్త్రి వర్ధంతి

ప్రజాశక్తి - మొగల్తూరు

లాల్ బహదూర్ శాస్త్రి వర్ధంతిని ముత్యాలపల్లిలో ఆరోగ్య వర్ధిని వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంస్థ కార్యదర్శి నాగిడి రాంబాబు మాట్లాడారు. భారతదేశ స్వతంత్ర ఉద్యమ నాయకుడు, భారతదేశ రెండో ప్రధానిగా దేశానికి ఎనలేని సేవలందించిన మహోన్నత వ్యక్తి లాల్ బహదూర్ శాస్త్రి అని అన్నారు.

నేటి నుంచి రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలు

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లులో ధర్మారావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరుగుతున్న సంక్రాంతి సంబరాల్లో భాగంగా మూడు రోజుల పాటు జరిగే ఎంఎల్ఎ కప్ రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలు శుక్రవారం నుంచి ప్రారంభం కానున్నట్లు ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడు తెలిపారు. స్థానిక బిఆర్ఎంవి మున్సిపల్ హైస్కూల్ గ్రౌండ్‌లో సాయంత్రం నాలుగు గంటలకు జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి ప్రారంభిస్తారని, క్రీడాకారులను నరసాపురం ఆర్‌డిఒ ఎం.అంబరీష్ పరిచయం చేసుకుంటారని తెలిపారు. ముఖ్య అతిథులుగా మాజీ మంత్రి పితాని సత్యనారాయణ, మాజీ ఎంఎల్‌సి అంగర రామ్మోహన్, ప్రముఖ సినీ నిర్మాత బన్నీ వాసు, క్షీరపురి ఉత్సవ కమిటీ ఛైర్మన్ చేగొండి సూర్యప్రకాష్, ఎఎంసి మాజీ ఛైర్మన్ కబర్ధి పాల్గొంటారని తెలిపారు. సూర్యమిత్ర ఎగ్జిమ్ ప్రయివేట్ లిమిటెడ్ డాక్టర్ యిర్రింకి సూర్యారావు, సినీ నిర్మాత వాకాడ అంజన్‌కుమార్, సినీ గేయ రచయిత చేగొండి అనంతశ్రీరామ్‌లకు పౌర సన్మానం చేయనున్నట్లు తెలిపారు.

మండల స్థాయి ముగ్గుల పోటీలు

పోడూరు : సంక్రాంతి సంబరాల్లో భాగంగా ధర్మారావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో పోడూరు మండల స్థాయిలో మహిళలకు ముగ్గుల పోటీలు గురువారం జిన్నూరులో నిర్వహించారు. పోటీలో మొత్తం 52 మంది పాల్గొన్నారు. పోటీలో పాల్గొన్న మహిళలందరికీ ధర్మారావు ఫౌండేషన్ తరపున చీర, ప్లాస్టిక్ డబ్బాను ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడు చేతులమీదుగా అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిఏటా సంక్రాంతి సంబరాల్లో భాగంగా మహిళలకు ముగ్గులపోటీలు, రాష్ట్రస్థాయిలో ఎంఎల్ఎ కప్ వాలీబాల్ పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. పోటీల్లో విజేతలు 14వ తేదీన ముగింపు సభ రోజున నియోజకవర్గ స్థాయిలో జరిగే ముగ్గుల పోటీలకు అర్హులన్నారు. ఈ కార్యక్రమంలో మండలాధ్యక్షులు గొట్టుముక్కల సూర్యనారాయణరాజు, కర్నేని రోజారమణి, పెచ్చెట్టి బాబు, దేవల్ల ప్రసాద్, దాసరి రత్నరాజు, పాలవలస తులసీరావు పాల్గొన్నారు.

ముగిసిన సంక్రాంతి సంబరాలు

గణపవరం : గణపవరం డిగ్రీ కాలేజీలో సంక్రాంతి సంబరాలు గురువారంతో ముగిశాయి. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ పి.నిర్మాలకుమారి మాట్లాడుతూ దేశ సంస్కృతీ సంప్రదాయాల విశిష్టతను విద్యార్థులు తెలుసుకోవాలన్నారు. ఏ స్థాయికి వెళ్లినా జనజీవన విధానానికి సంబంధించిన విషయంలో మన సంస్కృతి మూలాలు మర్చిపోకూడదన్నారు. మూడురోజుల పాటు జరిగిన సంక్రాంతి సంబరాల్లో ముగ్గుల పోటీలు, సాంప్రదాయ మెహందీ, వస్త్రధారణ వంటి తొమ్మిది రకాల పోటీలు నిర్వహించారు. పోటీల్లో గెలుపొందినవారికి బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో లెక్చరర్లు జి.వెంకట్రావు, కె.స్వరూపరాణి, సిహెచ్.అనురాధ, చైతన్య, జి.వెంకటరమణ, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

19న అంబేద్కర్ విగ్రహావిష్కరణ జయప్రదానికి పిలుపు

ప్రజాశక్తి - ఆచంట

ఈ నెల 19వ తేదీన సిఎం జగన్ ఆధ్వర్యంలో విజయవాడలో అంబేద్కర్ 125 అడుగుల విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వైసిపి రాష్ట్ర కార్యదర్శి వైట్ల కిషోర్ కుమార్ పిలుపునిచ్చారు. ఆచంటలో అంబేద్కర్ చిత్రపటానికి గురువారం ఆయన పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి సభ్యులు ఉల్లం రామానుజం, తప్పెట్ల వెంకట్రావు, జిల్లా కార్యదర్శి దేవిరెడ్డి రాంబాబు, మండల కార్యదర్శి మనవర్తి విజయ్‌కుమార్, లీగల్ సెల్ అధ్యక్షుడు ఉమేష్, స్టూడెంట్ వింగ్ ప్రెసిడెంట్ ఎం.నాని, బాలిన వీరాస్వామి, ఆరుపల్లి సత్యనారాయణ, శీలం చిట్టియ్య, బండి పద్మమోహనరావు, పీతల నాగేశ్వరరావు, గుత్తుల రామకృష్ణ, గుబ్బల వరలక్ష్మి, బండి మహేష్, డి.ప్రశాంత్ పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

తల్లీ కుమారుడిపై నలుగురు దాడి

ప్రజాశక్తి - పెనుగొండ

తల్లి కుమారుడిపై నలుగురు దాడి చేసిన ఘటన పెనుగొండ నగరేశ్వరి కాలనీ బీడులో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నగరేశ్వరి కాలనీ బీడుకు చెందిన కుటుంబం మంగమ్మ, ఆమె కుమారుడు బాలకృష్ణ, మరో కుటుంబం బురిడీ శ్రీనివాస్, అతని భార్య విజయలక్ష్మిదుర్గ పక్కపక్కనే ఇంట్లో నివాసం ఉంటున్నారు. ఈ క్రమంలో పక్క ఇంట్లో నుంచి వస్తుందని, తన తల్లికి ఆరోగ్యం బాలేదని మంగమ్మ కుమారుడు బాలకృష్ణ శ్రీనివాస్‌కు చెప్పాడు. ఈ క్రమంలో మాటమటా పెరిగడంతో బురిడీ శ్రీనివాస్, అతని భార్య, వారి కుమారులు రాజ్‌కుమార్, నాని కలిసి తల్లికుమారుడిపై కర్రలు, సుత్తితో దాడి చేశారు. ఈ దాడిలో గాయాలపాలైన వారిని స్థానికులు తణుకు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు కుటుంబసభ్యులు నలుగురిని అదుపులోకి తీసుకున్నారు.

దాతల సాయం.. పాఠశాల ప్రగతి పథం

కోపల్లె హైస్కూల్లో రూ.19 లక్షలతో సౌకర్యాల కల్పన

అండగా నిలుస్తున్న పూర్వ విద్యార్థులు




మినరల్ వాటర్ ప్లాంట్



సైకిల్‌షెడ్డు

ప్రజాశక్తి - కాళ్ల

విద్యార్థుల భవిష్యత్ తరగతి గదిలో రూపు దిద్దుకుంటుంది. నేటి బాలలే రేపటి భావిపౌరులుగా తీర్చిదిద్దేది పాఠశాలల్లోనే. అందుకే గుడికి చేసే ఉపకారం కంటే బడికి చేసే సాయం ఎక్కువ అంటారు. అటువంటి పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించి విద్యార్థులకు ఉపయోగపడే పనుల కోసం దాతలు ముందుకు వచ్చి విరాళాలు అందిస్తున్నారు. కొందరు దాతలు, పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు తాము సంపాదించిన దాంట్లో కొంత మొత్తాన్ని పాఠశాలలకు విరాళంగా అందించి పాఠశాల, విద్యాభివృద్ధికి సహకరిస్తున్నారు.



సీసీ రోడ్డు

కాళ్ల మండలంలోని కోపల్లె గ్రామంలో శ్రీమంతెన దుర్గరాజు రాజయ్యమ్మ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు పూర్వ విద్యార్థులు, గ్రామానికి చెందిన దాతలు, పాఠశాలలో పని చేసిన ఉపాధ్యాయులు కొంత డబ్బును విరాళంగా అందించి సైకిల్ షెడ్డు, మినరల్ వాటర్ ప్లాంట్, సిమెంట్ రోడ్డు నిర్మాణం, కళావేదిక, గార్డెన్ అభివృద్ధి పనులు చేపట్టారు. ఈ నెల 12వ తేదీన రూ.19 లక్షలతో అభివృద్ధి పనులు ప్రారంభం కానున్నాయి.

రూ.19 లక్షలతో అభివద్ధి

కోపల్లె ఉన్నత పాఠశాలకు దాతలు రూ.16 లక్షలు విరాళంగా అందించారు. మండల పరిషత్ నిధులు రూ.3 లక్షలు మొత్తం రూ.19 లక్షలతో అభివృద్ధి పనులు చేపట్టారు.

సైకిల్ షెడ్డు నిర్మాణం

జక్కరం గ్రామానికి చెందిన సాగిరాజు అప్పలరాజు (సింగపూర్ అప్పన్న) రూ.5.51 లక్షలు ఆర్థిక సాయం అందించడంతో సైకిల్ షెడ్డును నిర్మించారు. బాలికల సైకిల్ షెడ్డుగా ఉపయోగించనున్నారు. సైకిల్ షెడ్డు నిర్మాణంలో సాగిరాజు అప్పలరాజు ముఖ్యపాత్ర వహించటం హర్షణీయం.

మినరల్ వాటర్ ప్లాంట్

హైస్కూల్‌లో ఆర్‌ఒ ప్లాంట్ నిర్మాణానికి దాతలను సమీకరించడంలో ఉండి ఎంఎల్ఎ మంతెన రామరాజు ముందుకువచ్చారు. విర్బాక్ కంపెనీ ఆధ్వర్యంలో మినరల్ వాటర్ ప్లాంట్‌ను రూ.3.50 లక్షలతో ఎంఎల్ఎ రామరాజు ప్రోత్సాహంతో ఏర్పాటు చేశారు.

సిమెంట్ రోడ్డు నిర్మాణం

ఎంపిపి పెన్మెత్స శిరీష విశ్వనాథరాజు కృషితో మండల పరిషత్తు నిధులు రూ.3 లక్షలు మంజూరయ్యాయి. హైస్కూల్‌కి వచ్చే ప్రధాన రహదారిలో సిమెంట్ రోడ్డు నిర్మాణ పనులు పూర్తయ్యాయి.

కళావేదిక

ఉండి మాజీ ఎంఎల్ఎ పాతపాటి సర్రాజు జ్ఞాపకార్థంగా వారి కుమారులు పాతపాటి వెంకట శ్రీనివాసరాజు(వాసు), పాతపాటి యుగంధర్‌వర్మ కళావేదికను నిర్మించేందుకు ముందుకు వచ్చారు. సుమారు రూ.6 లక్షలతో నిర్మిస్తున్నారు.

గార్డెన్

స్కూల్ ఆవరణలో వివిధ రకాల మొక్కలను నాటి సంరక్షిస్తున్నారు. చుట్టూ పచ్చని చెట్లు, వివిధ రకాల మొక్కలు పరిశుభ్రమైన ఆవరణతో బడి ప్రకృతి ఒడిలో ఉన్నట్లుగా అనిపిస్తున్నది. గార్డెన్ ఏర్పాటుకు వేంపాడు గ్రామానికి చెందిన రిటైర్డ్ ప్రొఫెసర్ వేగేశ్న సత్యనారాయణరాజు (విఎస్ఎన్.రాజు) రూ.లక్ష ఆర్థిక సహకారం అందించారు.

రూ.1.50 కోట్లతో పాఠశాల అభివృద్ధి
కొత్తపల్లి బంగార్రాజు, పూర్వ విద్యార్థి, జక్కరం



కోపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను పూర్వ విద్యార్థుల విరాళాలు రూ.1.50 కోట్లతో అభివృద్ధి చేయాలని నిర్ణయించుకున్నాం. విఎస్ఎన్.రాజు సూచనలు, సలహాల మేరకు ఎన్ఆర్ఐలు, పూర్వ విద్యార్థుల నుంచి విరాళాలు సేకరించి పాఠశాలను సుందరంగా నిర్మించనున్నాం. పాఠశాల చుట్టూ వాకింగ్ ట్రాక్, ఆటలకు సంబంధించిన కోర్టులు కొత్తగా నిర్మించనున్నాం. గ్రౌండ్ లెవెలింగ్ చేయనున్నాం. చెరువు చుట్టూ రిటర్నింగ్ వాల్ నిర్మాణ పనులు చేపట్టాల్సి ఉంది. పాఠశాలలో పలు అభివృద్ధి పనులు చేయడానికి సూచనలు, సలహాలు తీసుకుంటున్నాం. ఛైర్మన్‌గా డాక్టర్ వేగశ్న రామకృష్ణంరాజు, సెక్రటరీగా కొత్తపల్లి బంగార్రాజు, పాఠశాల అభివృద్ధి కమిటీ ఛైర్మన్ మంతెన రామ్‌కుమార్‌రాజు, ట్రెజరర్‌గా వేగశ్న రామరాజు వ్యవహరిస్తున్నారు.

కార్పొరేట్ స్థాయిలో పాఠశాలను తీర్చిదిద్దుతాం
రామ్‌కుమార్‌రాజు, హైస్కూల్ అభివృద్ధి కమిటీ ఛైర్మన్



పాఠశాలను కార్పొరేట్ స్థాయిలో తీర్చిదిద్దుతాం. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు కార్పొరేట్ స్థాయిలో పోటీ పడే విధంగా ఉండాలి. పూర్వ విద్యార్థుల సహకారంతో విద్యార్థులకు అవసరమైన సౌకర్యాలు ఏర్పాటు చేశాం.

నేడు ప్రారంభోత్సవాలు

శ్రీమంతెన దుర్గరాజు రాజయ్యమ్మ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థుల విరాళాలతో పలు అభివృద్ధి పనులు శుక్రవారం ప్రారంభించనున్నట్లు పాఠశాల పూర్వ విద్యార్థి కొత్తపల్లి బంగార్రాజు తెలిపారు. జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి, డిసిసిబి ఛైర్మన్ పివిఎల్.నరసింహరాజు, ఐఐటి బొంబాయి ప్రొఫెసర్ విఎస్ఎన్.రాజు చేతులమీదుగా ప్రారంభోత్సవాలు జరగనున్నట్లు తెలిపారు.

సెమిస్టర్ ఫలితాలు విడుదల

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లు ఎఎస్ఎన్ఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డిసెంబర్ చివరి వారంలో జరిగిన మొదటి సెమిస్టర్ పరీక్ష ఫలితాలను కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ టి.రాజరాజేశ్వరి గురువారం విడుదల చేశారు. రాష్ట్రంలో మొదటిసారిగా ప్రవేశపెట్టిన డిగ్రీ సింగల్ మేజర్ విధానంలో మెదటి సెమిస్టర్ పరీక్షలు నిర్వహించారు. మొదటి సెమిస్టర్‌కు 174 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా 146 మంది ఉత్తీర్ణత సాధించారు. 84 ఉత్తీర్ణత శాతం నమోదైంది. ఈ సందర్భంగా ఉత్తీర్ణులైన విద్యార్థులను ప్రిన్సిపల్ అభినందించారు. ఈ కార్యక్రమంలో కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ టి.కృష్ణ, ఎగ్జామ్స్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నరసాపురంలో 'జయహో బిసి'

నరసాపురం టౌన్ :పట్టణంలోని 25వ వార్డు నందమూరి వివర్స్ కాలనీలో గురువారం జయహో బిసి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన టిడిపి నరసాపురం నియోజకవర్గ ఇన్‌ఛార్జి పొత్తూరి రామరాజు స్థానిక చేనేత కార్మికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సమస్యలను తెలుగుదేశం, జనసేన అధిష్టానం దృష్టికి తీసుకువెళ్తానని, అధికారంలోకొచ్చిన తర్వాత పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి బొమ్మిడి నాయకర్, రాష్ట్ర అగ్నికుల క్షత్రియ సాధికార కమిటీ కన్వీనర్ కొప్పాడ రవీంద్రనాథ్ ఠాగూర్, పట్టణ అధ్యక్షులు జక్కం శ్రీమన్నారాయణ, పట్టణ ప్రధాన కార్యదర్శి కొల్లు పెద్దిరాజు, మండలాధ్యక్షులు వాతాడి ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

In the Court of the I Additional Junior Civil Judge, Eluru
O.S. No. 510/2021

Between:
Smt. Pamarthi Lakshmi Kanthamma ...*Petitioner/ Plaintiff*
AND
Smt. Pajjuri Sivamma & 4 Others ...*Respondents/ Defendants*

పై నంబరు పిటీషనులో 5వ రెస్పాండెంటు అయిన **D-5:** శ్రీ కాశీ రవికుమార్ @ కృష్ణ, Eluru City President of Andhra Pradesh, Dalitha Hakkula Porata Samithi, O/o. Spurthi Bhavan, R.R.Pet, Eluru, W.G.Dist., అను వారికి నోటీసులు అమలు కొరకు **ది. 22-1-2024 రోజున వాయిదా అయివున్నది.** సదరు వాయిదా రోజు స్వయముగా గాని, ప్లీడరు గారి ద్వారా గాని కోర్టుకి హాజరు అయ్యి ఆక్షేపణలు తెలుపుకోవలెను. లేని యెడల వారి పరోక్షమందు తీర్మానించెదరు.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)

ఏలూరు — **ఈ.శ్రీనివాసబాబు**
ది.10-1-2024 — అడ్వకేటు, ఏలూరు

అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే చర్యలు

ప్రజాశక్తి - నరసాపురం టౌన్

పండుగల పేరు చెప్పి సాంప్రదాయ క్రీడలు అనే పేరుతో అసాంఘిక కార్యకలాపాలు కోడిపందేలు, జూదం నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆర్‌డిఒ ఎం.అచ్యుతఅంబరీష్ హెచ్చరించారు. ఆర్‌డిఒ కార్యాలయ సమావేశ మందిరంలో పోలీసు, పంచాయతీ, మున్సిపల్, రెవెన్యూ పలు శాఖల అధికారులతో డివిజన్ స్థాయి సమీక్ష సమావేశం గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిఐ జి.శ్రీనివాసయాదవ్, మున్సిపల్ కమిషనర్లు డాక్టర్ కె.వెంకటేశ్వరరావు, బిఆర్ఎస్.శేషాద్రి, తహశీల్దార్ సయ్యద్ మౌలాలీ ఫాజిల్, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

మొగల్తూరు :కోడిపందేల నిర్వహణకు అనుమతులు లేవని, నిర్వహిస్తే చర్యలు తీసుకుంటామని తహశీల్దార్ జి.అనితకుమారి అన్నారు. మొగల్తూరులోని మండల పరిషత్ కార్యాలయంలో పలు శాఖల అధికారులతో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. అందరూ కూడా బాధ్యతాయుతంగా కోడిపందేల నిర్వహణను అడ్డుకునేందుకు కృషి చేయాలని సూచించారు. ఎస్ఐ ఎం.వీరబాబు మాట్లాడుతూ కోడిపందేలకు సంబంధించి సమాచారాన్ని తమకు తెలియజేయాలన్నారు.

తాడేపల్లిగూడెం అర్బన్ రీసర్వే పూర్తి

టీమ్‌కు జెసి రామ్‌సుందర్‌రెడ్డి అభినందన
నేడు నోటిఫికేషన్ జారీ



అధికారులతో మాట్లాడుతున్న జెసి రామ్‌సుందర్‌రెడ్డి

ప్రజాశక్తి - భీమవరం

దేశంలోనే పైలెట్ ప్రాజెక్టుగా ఉన్న తాడేపల్లిగూడెం అర్బన్ రీ సర్వే పూర్తవ్వడం అభినందనీయమని జాయింట్ కలెక్టర్ ఎస్.రామ్‌సుందర్‌రెడ్డి అన్నారు. దిగ్విజయంగా పూర్తి చేసిన టీమ్‌ను ప్రత్యేకంగా అభినందించి ఇదే స్ఫూర్తితో పనిచేయాలని కోరారు. స్థానిక కలెక్టరేట్‌లో తాడేపల్లిగూడెం అర్బన్ రీ సర్వే పూర్తి, 12వ తేదీ నోటిఫికేషన్ జారీ పలు అంశాలపై ఆర్‌డిఒ కె.చెన్నయ్య, జిల్లా సర్వే అధికారి కె.జాషువా, సంబంధిత అధికారులతో జిల్లా జాయింటు కలెక్టరు సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పురపాలక సంఘం కమిషనర్ డాక్టర్ ఎ.శామ్యూల్, తహశీల్దార్ ఎస్.శివశంకర్, జిల్లా కలెక్టరేట్ ల్యాండ్ తహశీల్దార్ సిహెచ్.రవికుమార్, సహాయ సిటీ ప్లానర్ జి.సీతారామ్, మండల సర్వేయర్ ఆర్.రామకృష్ణ, ఐటి టీమ్స్, వార్డు సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

సేవకునిగా పని చేయడమే సంతృప్తి : ఎంఎల్ఎ నిమ్మల

ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్

ఎంఎల్ఎ పదవి కన్నా నా నియోజకవర్గ ప్రజలకు సేవకునిగా పని చేయడమే తనకు సంతృప్తి అని ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడు అన్నారు. పందిగుంటలో గురువారం నిర్వహించిన క్రిస్మస్ ఆరాధన వేడుకల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. సేవాగుణం, సేవా తత్పరత, ప్రేమ, దయ, కరుణ, నిస్వార్థం వంటివి అలవర్చుకోవాలన్నారు. అనంతరం ఎంఎల్ఎను సత్కరించారు. ఈ కార్యక్రమంలో పాస్టర్ మోషే, గొట్టుముక్కల సత్తిపండురాజు, మారంపూడి సత్యానందం, మారంపూడి ధర్మారావు పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ సేవలు స్ఫూర్తిదాయకం

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

తాడేపల్లిగూడెం డైమండ్స్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో జరుగుతున్న సేవలు స్ఫూర్తిదాయకమని 316 జిల్లా గవర్నర్ గట్టిం మాణిక్యాలరావు అన్నారు. డైమండ్స్ అధ్యక్షులు కొప్పిశెట్టి రమణయ్య పుట్టినరోజును పురస్కరించుకుని గురువారం నిర్వహించిన పలు సేవా కార్యక్రమాల్లో ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా గట్టిం మాణిక్యాలరావు మాట్లాడుతూ డైమండ్స్ లయన్స్ క్లబ్ ద్వారా మరింత మందికి సేవలు అందాలన్నారు. క్లబ్ అధ్యక్షులు కొప్పిశెట్టి రమణయ్య ఆధ్వర్యంలో 180 రోజుల్లో 250 సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. జోన్ చైర్‌పర్సన్ లయన్ పేరిచర్ల మురళీకృష్ణంరాజు మాట్లాడుతూ గుప్త దాతగా అనేక దైవిక కార్యక్రమాలకు సహకారం అందించిన మోడ్రన్ చంటి స్ఫూర్తితో లయన్స్ సభ్యులు మరిన్ని సేవలందించాలన్నారు. పడాల జీవన సంధ్య వృద్ధాశ్రమంలో వృద్ధులకు అన్నదానం, యాగర్లపల్లి ప్రేమలయం ఆశ్రమంలో పండ్లు, పౌష్టకాహారం, లార్డ్స్ ఆఫ్ లైఫ్ చిల్డ్రన్స్ హోమ్‌కు రైస్ బ్యాగ్, యాచకులకు ఫుడ్ ప్యాకెట్స్ అందించారు. ఈ కార్యక్రమలో లయన్స్ పుత్రయ్య, కుందుం వెంకటేశ్వరరావు, యర్రా ఆంజనేయస్వామి, కలవచర్ల సత్యనారాయణ, కొప్పెళ్ల సాయి, సత్యనారాయణరాజు, జామి సత్యనారాయణ, అభయం లియో, లయన్ అధ్యక్షులు మాధురి పాల్గొన్నారు.

శ్రీ కోర్టు వారి పత్రికా ప్రకటన
In the Court of the Principal Jr Civil Judge Tanuku
O.S.No.322/22

Between :
UBI (Erstwhile Andhra Bank) Rep by its Sr Manager Relangi Branch ...Plaintiff
And
1. Vemula Krishna, S/o Venkata Ratnam, D.No.21-6-7, Yedla Bazar, W.No.14, Palakollu (M), W.G.Dist, AP.
2.Vemula Vardhana Rao, S/o Chiranjeevi, Door. No.4-105, Gaggiparru (V), Kontheru (P), Yelamanchili (M), W.G.Dist ...Defendents

పై నంబరు గ్రంథంలో వాది మీ పై బ్యాంక్ లోను రికవరీ నిమిత్తం పై దావా చేసినారని అందులో ప్రతివాదులయిన మీరు అనేక సార్లు శ్రీ కోర్టు వారు మీకు కోర్టు ద్వారాను, తపాల ద్వారాను మీకు పంపించిన దావా సమన్లు మీరు ఉద్దేశ్యపూర్వకముగా తీసుకోకుండా కాలయాపన చేసిన కారణంగా సదరు శ్రీకోర్టు వారు యిందు మూలముగా సదరు దావా సమన్లను యీ పత్రికా ప్రకటన ద్వారా దావా సమన్లు ఆర్డరు చేసినందున సదరు పై నంబరు గ్రంథంలో **ది.05-02-2024 తేదీన** మీ హాజరు నిమిత్తం వాయిదా అయియున్నదని ఆ రోజున మీరు వ్యక్తిగతముగా గాని, మీ ప్లీడరు గారి ద్వారా గాని **ఉదయం 10.30 గంటలకు** హాజరు కావలెనని, లేనిచో పై నెంబరు గ్రంథంలో మీకు పరోక్షముగా శ్రీకోర్టువారు ఆర్డరు చేయుదురని యిందుమూలముగా తెలియపరచడమైనది.

వాయిదా : 05-02-2024.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)

వాది తరపు అడ్వకేట్
E.S.V.B. Madhavi
Panel Advocate, Bhimavaram.

గ్రామాలాభివృద్ధిపై శ్రద్ధ చూపాలి : చీఫ్ విప్

ప్రజాశక్తి - నరసాపురం టౌన్

గ్రామాలభివృద్ధిపై అధికారులు శ్రద్ధ చూపాలని ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు సూచించారు. స్థానిక ప్రభుత్వ చీఫ్ విప్ క్యాంపు కార్యాలయంలో గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలపై వివిధ శాఖల అధికారులు, గ్రామ సర్పంచులు, ఎంపిటిసిలతో ఆయన గురువారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వివిధ దశల్లో ఉన్న పనులు, నిధులు మంజూరై ప్రారంభం కాని పనులను వెంటనే మొదలుపెట్టి 20 రోజుల్లోగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ సయ్యద్ మౌలాల ఫాజిల్, ఎంపిడిఒ వీరభద్రరావు, హౌసింగ్ డిఇ వెంకటేశ్వరరావు, ఎఇ రవీంద్ర పాల్గొన్నారు.

ఘనంగా బండారు పుట్టినరోజు వేడుకలు

ప్రజాశక్తి - నరసాపురం టౌన్

నరసాపురం మాజీ ఎంఎల్ఎ బండారు మాధవనాయుడు పుట్టినరోజు వేడుకలు స్థానిక రాయిపేట కార్యాలయంలో అభిమానులు, టిడిపి కుటుంబ సభ్యులు, వివిధ పార్టీల నాయకులు, ప్రముఖుల సమక్షంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన రక్తదాన శిబిరంలో 50 మందికి పైగా అభిమానులు రక్తదానం చేశారు. మాజీ ఎంఎల్ఎ బండారు మాధవనాయుడు, యువత ప్రభుత్వాసుపత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్లు అందించారు.

వేలం ప్రకటన
మహారాజశ్రీ నూజివీడు సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
ఇ.పి. 37/2018 ఇన్ ఓ.యస్. నెం. 494/2015

బిట్వీన్:
వాసా శ్యామలాంబ అనే శ్యామల *-డి. హెచ్. ఆర్.*
మరియు
నీలపాల సత్యవతి *-జే. డి. ఆర్.*

కృష్ణా జిల్లా, నూజివీడు సబ్ రిజిస్ట్రార్ వారి యిలాకా, ముసునూరు మండలం, గోపవరం పంచాయితీ, ముసునూరు మండలం, గోపవరం గ్రామ ఆర్.యస్. నెం. 305/6 దాఖలా య. 0-07 1/2 సెంట్లు లేక 363 చ॥గజముల నివేశన స్థలం మరియు సదరు స్థలంలో నిర్మింపబడియున్న డోర్ నెం. 1-25 దాఖలా ఆర్.సి.సి. డాబా ఇల్లు, సదరు ఇంటికి అమర్చబడిన యావత్ పరికరములతో సహా పై తెలిపిన జే.డి.ఆర్. యొక్క సంపూర్ణ స్వాధీన హక్కుభుక్తములలో వుండి, ఈ డిక్రీ బాకీ క్రింద జప్తు ఛార్జి కాబడి, వేలం కావలసియున్న ఆస్తికి హద్దులు.

తూర్పు: 5 గజముల నడక దారి.
దక్షిణం: నల్లిబోయిన నాగేశ్వరమ్మ గారి స్థలం.
పడమర: సాయిల చిట్టియ్య గారి స్థలం.
ఉత్తరం: 4 గజముల నడక దారి.

డి. హెచ్. ఆర్. విలువ: రూ. 10,00,000/-
అమీనా విలువ: రూ. 15,00,000/-

పైన తెలిపిన ఆస్తిని శ్రీ కోర్టు వారు **ది. 29-01-2024 తేదీన ఉదయం 10.30 ని॥లకు** బహిరంగ వేలం వేయుదురు. కావున కావాల్సినవారు పాడుకొనవచ్చును.

(కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)

యమ్. రమేష్
డి. హెచ్. ఆర్. తరపు న్యాయవాది, నూజివీడు

రోడ్ల అభివృద్ధికి చర్యలు

ప్రజాశక్తి - భీమవరం రూరల్

భీమవరం నియోజకవర్గంలో రోడ్ల అభివృద్ధికి పటిష్ట చర్యలు తీసుకున్నామని రాష్ట్ర ప్రభుత్వ విప్, ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్ అన్నారు. మండలంలో ఆదిత్య కాలేజీ నుంచి కొమరాడ, అనాకోడేరు వరకు రూ.3 కోట్ల నిధులతో నిర్మించే సీసీ, బీటీ రోడ్డు నిర్మాణానికి ఆయన గురువారం అనాకోడేరు గ్రామంలో శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో ప్రతి రోడ్డు కూడా అభివృద్ధి చేస్తున్నామన్నారు. భీమవరం నుంచి లోసరి వరకు రూ.ఏడు కోట్లతో నిర్మించే రోడ్డుకు సంబంధించిన పనులు త్వరలో ప్రారంభిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎఎంసి ఛైర్మన్ కోటిపల్లి బాబు, ఎంపిపి పేరిచర్ల విజయనరసింహరాజు, జెడ్‌పిటిసి సభ్యులు కాండ్రేగుల నరసింహరావు, ఎఎంసి మాజీ ఛైర్మన్ తిరుమాని ఏడుకొండలు, ఆర్అండ్‌బి ఇఇ లోకేశ్వరరావు, డిఇ రామరాజు, తహశీల్దార్ రవికుమార్, గ్రామ సర్పంచి జుత్తిగ కనకదుర్గ వరప్రసాద్, ఎంపిటిసి సభ్యులు మైనపు వెంకటేశ్వరరావు, గ్రామ అభివృద్ధి కమిటీ నాయకులు అల్లూరి రవికుమార్‌రాజు, జవ్వాది గణేష్ పాల్గొన్నారు.

'టిడిపికి బిసిలే వెన్నెముక'



కార్యక్రమంలో ఎంఎల్ఎ మంతెన రామరాజు

కాళ్ల : తెలుగుదేశం పార్టీ ఏర్పాటైనప్పటి నుంచి బిసి వెన్నెముకగా నిలిచారని, టిడిపి పాలనలోనే నిరుపేదలు, బిసిలు, ఎస్‌సి, ఎస్‌టిలకు ఎంతో మేలు జరిగిందని ఉండి ఎంఎల్ఎ మంతెన రామరాజు అన్నారు. మండలంలోని బొండాడ గ్రామంలో ఇంటింటికీ మన రాంబాబు, భవిష్యత్తుకు గ్యారంటీ, బాబుతో నేను కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మంతెన రామరాజు మాట్లాడుతూ నియోజకవర్గంలో సుమారు లక్ష మంది ఓటర్ల ఇంటింటికి వెళ్లి కలిసినట్లు చెప్పారు. 850 కిలోమీటర్లు సుదీర్ఘంగా ఇంటింటికి వెళ్లి ప్రచారం చేశామన్నారు. ఈ సారి ఎన్నికల్లో టిడిపి, జనసేన కూటమి విజయం తథ్యమన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండలాధ్యక్షుడు జివి.నాగేశ్వరరావు, మాజీ ఎంపిపి ఆరేటి వెంకటప్రసాద్, పార్టీ గ్రామ అధ్యక్షుడు కందుల కృష్ణమూర్తి, ఎంపిటిసి మాజీ సభ్యులు బొత్స గణేష్, మాజీ సర్పంచి కట్రెడ్డి శ్రీనివాసరావు, కందుల అరవిందు, కొల్లి శ్రీను పాల్గొన్నారు.

మహిళా కబడ్డీ జట్టుకు అభినందన

ప్రజాశక్తి - ఉండి

ఆడుదాం ఆంధ్రా కార్యక్రమంలో మండల స్థాయి మహిళా కబడ్డీ విభాగంలో విజేతలుగా నిలిచిన ఎన్ఆర్‌పి అగ్రహారం జట్టుకు ఆ గ్రామ సర్పంచి సురవరపు కనకదుర్గ వెంకటాచార్యులు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తమ గ్రామానికి చెందిన కబడ్డీ జట్టు మహిళా విభాగంలో మండల స్థాయిలో ప్రథమ స్థానంలో నిలవడం అభినందనీయమన్నారు. జిల్లా స్థాయిలో కూడా సత్తా చాటి ప్రథమ స్థానంలో నిలవాలని వారు ఆకాంక్షించారు. మహిళా జట్టును బిసి సంఘం జిల్లా అధ్యక్షులు వెంకటాచార్యులు, గ్రామ మాజీ సర్పంచి మునుకోలు సింహాచలం, గలావిల్లి ధనుంజయ అభినందించారు.

గ్రామపంచాయతీ కార్యాలయం, వేల్పూరు
తణుకు మండలం, పశ్చిమగోదావరి జిల్లా

టెండరు ప్రకటన

రి.క. నెం.1/2024 — తేది.10-01-2024

పశ్చిమగోదావరి జిల్లా, తణుకు మండలం, వేల్పూరు గ్రామపంచాయితీ నందు 2023-2024 సంవత్సరమునకు అనగా ది. 01-04-2023 నుండి 31-03-2024 వరకు ఒక సంవత్సర కాలమునకు ది. 18-01-2024 తేది గురువారం ఉదయం గం॥ 11ల నుండి మధ్యాహ్నం గం॥ 1 వరకు వేల్పూరు గ్రామపంచాయితీ కార్యాలయము నందు పంచాయితీ కార్యదర్శి గారు లేదా వారి అనుమతి పొందిన వారితో గాని టెండర్లు స్వీకరించబడును. మరియు అదేరోజు అనగా ది. 18-01-2024 నిర్ణయింపబడిన మధ్యాహ్నం గం॥ 3లకు వేల్పూరు గ్రామపంచాయితీ కార్యాలయము నందు అప్పటికి హాజరు కాబడిన టెండర్లదారుల సమక్షంలో టెండర్లు తెరువబడును అని తెలియజేయడమైనది. టెండర్లు నిలుపుదల చేయుటకు లేదా వాయిదా వేయుటకు గ్రామపంచాయితీ కార్యదర్శి వారికి పూర్తి అధికారము కలదు. ఇతర వివరములు పంచాయితీ కార్యాలయపు పనివేళల యందు అడిగి తెలుసుకొనవచ్చును.

షెడ్యూల్

వ.నెం.	కావలసిన సామగ్రి	కావలసిన వస్తువుల సంఖ్య	టెండరు ధరావత్తు
1.	ప్రజారోగ్య పారిశుధ్య సామాగ్రి	చేతిపారలు, కర్రపారలు, చెత్త డబ్బాలు, ఫినాయిల్, యాసిడ్, చీపుర్లు, మొదలగు పారిశుధ్య సామాగ్రి	రూ. 5000/-
2.	బ్లీచింగు, సున్నం	95 బస్తాలు, 18 టన్నులు	రూ. 5000/-
3.	విద్యుత్ సామాగ్రి విడిభాగాలు STL, LED's ఫిటింగ్స్, కరెంటు లైట్లు	36 వాట్ లైట్స్ 200, 24 డ్రైవర్స్ 400 36 ప్లేట్ 150, 24 LED 100, 320 వైర్ - 6, 718 వైర్ 3 కట్టలు 20 MCP 50, టేపులు 25, పైపులు, క్యాంపులు	రూ. 5000/-
4.	మంచినీటి సరఫరా	మంచినీటి సరఫరా సామాగ్రి GI పైపులు PVC పైపులైను, ట్యాపులు మరియు ఇతర సామాగ్రి	రూ. 5000/-
5.	స్టేషనరీ	బుక్స్ & ఫారంలు, రిజిష్టర్, A4 పేపర్లు, పెన్నులు, ఇతర సామాగ్రి	రూ. 5000/-
6.	పారిశుద్ధ్య సిబ్బంది బట్టలు	చీరలు, కాకి ప్యాంట్‌లు, కాకి షర్ట్‌లు	రూ. 5000/-

సం/- **విశ్వనాథం కృష్ణవేణి**
సర్పంచ్
గ్రామపంచాయితీ, వేల్పూరు

సం/- **వి.గంగాధరరావు,**
పంచాయితీ కార్యదర్శి
గ్రామపంచాయితీ, వేల్పూరు, తణుకు మండలం, ప॥గో॥జిల్లా